జయ తీరుబాటుగా డైరీలు తిరగవేస్తే ఇంకా మరో చిన్న విషయం తెలిసి ఉండేది. అదేదంటే:

ఒకనాటిసాయంకాలం చీకటిఓకటి పడుతోంది. జయ రామూని వెంటపెట్టుకొని పక్కింటామె తోడుగా సినీమాకి వెళ్ళింది. అది రాజా ఉత్తరాదిని కొత్తఉద్యోగంలో పనిచేస్తూన్న నాలుగో ఏడాది.

"రాజాగారి ఇల్లు ఇదేనా?" అన్న తెలుగు గొంతుక ప్రశ్నకి ఆప్యాయంగా రాజా తలుపు తెరచి ఆగంతకుణ్ణి ఆహ్వానించాడు.

"నా పేరు రాఘవులు. జయకి కొంచెం దగ్గర బంధువుని కూడా. ఇద్దరం ఒకే ఊళ్ళో పుట్టి పెరిగాం. ఇలా దగ్గర ఊరికి పనిమీద రావడాన్న చూచిపోదామని వచ్చాను."

రాఘవుని ఆకారం, మనిషివాలకం, రాజాలోనే ఏవో తెలియని పిచ్చి ఆలోచనలు కలిగించాయి.

రాజా చిరునవ్వు నవ్వి "అరే! మీ రొక్క రోజూ ఆలస్యంగా వచ్చారు. జయ దేశంవెళ్ళింది. ఒకటి రెండు నెలలువరకూ రాదే" అన్నాడు.

రాఘవులు భూమ్మీదికి కుంగిపోయాడు. సినీమా రంగంలో ఒకరోజు, పాదుషా ఒకరోజు బికారిగా తిరిగే రాఘవులుకూడా రామూనొక్కసారి చూచి పోదామనివచ్చినట్లు సుళువుగాగ్రహించాడు రాజా. "రక్తస్పర్శ అన్నది ఎంత చెడ్డవస్తువు!" అనుకుని నిట్టూర్చాడు రాజా.

స్కెచ్

అవతారం అదృష్టం

ఎస్. ఎన్. ప్రభల

మా అవతారం పదహారవ ఏట స్కూల్ ఫైనల్ పరీక్షకు వెళ్ళాడు. ఆ వేసవిలోనే— అంటే యింకా ఫలితాలు ప్రకటింప బడకుండానే— 'అబ్బాయి' అందచందాలకూ, యింతవరకూ ఒక్కసారైనా ఫెయిలవకుండా పైకి వస్తూన్నందుకూ 'ప్రతిఫలం' లాటిది ఒకటి తటస్థించింది. చుట్టు పక్కలఉన్న ప్రతి గ్రామంనుండీ ఆడపిల్లలున్న పెద్ద మనుషుల తాలూకు ప్రతినిధులు పార్వతమ్మగారిని ఆకాశానికి ఎత్తేయడం ప్రారంభించారు.

"ఆయనుంటే రత్నంలాటి పిల్లాణ్ణి చూసి ఎలా మురిసిపోయేవారో. ఆ వినయవిధేయతలూ అవీ ఈ రోజుల్లో ఎవరి కుంటాయమ్మా!" అని ప్రారంభించి, మాటలలోకి దింపి, "మాటవరస కంటున్నాం తల్లీ! పట్నం, పైచదువులకు పంపిస్తున్నారుకదా. ఎటుపోయి ఎటొస్తుందో చేతినిండా డబ్బు, చిన్నతనం చూడండీ యిప్పుడే ఓ యింటివాణ్ణి చేస్తే ఎటు పోయి ఎటువచ్చినా 'మనవాడే' అవుతాడు." అనేసి ఊరుకుంటారు.

దానితో ఆవిడకు కంగారుపట్టుకుంది. ఊర్లో ఒక పెద్దను పిలిచి ఆ వేసవిలోనే ఉపనయనం, వివాహం రెండూ ఒక్కసారే అయాయనిపించారు. అవతారం అదృష్టవంతుడని అందరూ ఒక్క సారి అనుకున్నారు.

అంతే—మరుసటేడే మావగారిచ్చిన సైకిల్ మీద రొమ్ము విరుచుకుని కాకినాడ రోడ్లన్నీ తనవే ననడం ప్రారంభించాడు.

* * *

"అదృష్టం ఉంటే అన్నీ యిలాగే కూడుకు వస్తాయి." అన్నారు పార్వతమ్మగారు ఓసారి.

ఏమిటండీ అంటే 'వ్యక్తురాలు' ఆవకుండా పిల్లకు పెళ్ళి చేశామన్న గౌరవం వారికీ, కట్నం మాటటుంచి చిన్నపిల్లను తెచ్చుకున్న గౌరవం తనకూ దక్కిందంటే, అంతా 'అంతే'నంటారావిడ!

ఇలా యిప్పుడావిడెందుకంటున్నారో నా కర్థంగాక మా అవతారంకేసి చూస్తే మావాడు ముసిముసి నవ్వులు నవ్వుతూ ఓ 'శుభలేఖ' లాటిది నా చేతిలో పెట్టాడు.

ఇహనేం!

'సౌభాగ్యవతి లక్ష్మి శుక్రవారం ఉదయం... అనీ, ఆ తర్వాత శాంతీ గీంతీ అవీ చేయించాలనీ, ముచ్చట్లు మురిపాలూ తీర్చుకుందుకు రమ్మనీ,ఇంకా యింకా అంతా అలాగే పోయింది ధోరణి. మా వాడి ముఖంలో ఏదో విజయగర్వం అవ్వపిస్తోంది!

ఇంటర్ జూనియర్ వేసవిలో మావాడి మకాం అత్తవారి ఊర్లోనే!

లేఖలమీద లేఖలు వ్రాస్తూ రమ్మన్నవాళ్లు చూస్తూచూస్తూ పొమ్మనలేరుకదా!

పెద్దమనిషయిన పిల్ల... తర్వాత 'ఏదైనా అయితే'నలుగురూ గేలిచేస్తారనిభయపడి అత్తగారి తాలూకువాళ్ళంతా ఓ మంచి ముహూర్తం చూసి గదిలోకి పంపించి గొళ్లెంపెట్టి చక్కాబోయారు.

అంతే! శోభనం మా అవతారం సర్వస్వానికీ వినాశనాన్ని చేకూర్చిందని చెప్పలేనుగాని, విద్యా విషయంలో మాత్రం అలా అనడానికి సందేహించ నవసరంలేదు!

మూడురోజులు వరసగా సెలవువస్తే యింకో రెండురోజులు సెలవుపెట్టి ఆ వారంఅంతా శ్రీమతి గారింట్లో గడిపి చక్కావచ్చేవాడు.

నేనోసారి యీ విషయం వేళాకోళంగా అంటే,

"చిన్నతనం నాయనా...ఆ ముచ్చట్లూ, మురిపాలూ యిప్పుడుకాక ముసలివాళ్ళయాకనా? ఏదో ఇంకో రెణ్ణెల్లుపోతే మంచిదినంచూసి పిల్లనే యిక్కడకు తీసుకురావచ్చు. చేదోడు వాదోడుగాఉంటుంది. అందాకా ఏదో యిలానే-"

పార్వతమ్మగారు ఆ వాక్యం పూర్తిచేయకుండా నవ్వి ఊరుకున్నారు.

అంతేచాలు. నాలాంటివాళ్ళ కిలాంటి అవతారాల భవిష్యత్తు ఊహించుకుందుకు!

పద్దెనిమిదేళ్ళ ఫౌడిలేరిన పడుచు పెళ్ళాంతో కాపురం వెలగబెడుతూ మా వాడు యింటర్ పరీక్షకు తయారవుతున్నాడు.

జంఘాలశాస్త్రి లనుకుంటూ, ఓ చోట సెలవిస్తాడు: పథ్నాలుగేళ్ళవాడు ఒకడు ఏడాది కొడుకుని కని వాడితో బాటు తనూ ఏడుస్తున్నాడని.

అయితేనేం-అంతా అవతారం మరీ అదృష్టవంతు డన్నారు.

* * *

ఆ తర్వాత అయిదేళ్ళకు- అప్పటికి యిద్దరం విడిపోయి కూడా అయిదేళ్ళవుతుంది. నార్త్ గేటులోనుంచి వస్తూంటే మా వాడెదురుపడ్డాడు.

ఫౌంటెన్ మీద కూర్చుని, సన్నటి నీటిధారలను బిళ్ళ గన్నేరుపువ్వుతోటి చెదరగొడుతూ, కొద్దిగా అనుమానిస్తూనే అడిగాను "ఏం చేస్తున్నావ"ని.

అవతారం నుంతిలో ఉండి మాట్లాడుతూన్నట్లుగా, కొద్దిగా బాధగా, కొంచెం సిగ్గుగా యింకా యింకా రకరకాల అనుభూతుల్ని పొందుతూ "కలెక్టరాఫీసులో ఏదో వేకన్సీ ఉందట! దానికి 'కూడా' ఒక అప్లికేషన్ దాఖలు చేసాను. మా మావగారు ఆ విషయమై కనుక్కుని రమ్మంటే-"

నాకెక్కడలేని అనుమానాలూ కలగడం ప్రారంభించాయి.

"అంటే?—"

"అవును, ఇంటర్ నాలుగైదుసార్లుచూసి, విసుగెత్తి చదువుమానుకున్నాను. మొత్తంమీద రెండు మూడు సార్లు సర్వీస్ కమీషన్‌కుకూడా కట్టాను. కానీ ఆదేమీ కొరుకుడు పడటంలేదు. టైపు షార్ట్ హాండ్ నేర్చుకొన్నాను. 'హయ్యర్' అయిందని పించేసరికి అయ్యమ్మలు దిగి చక్కా వచ్చారు. అమ్మ పోయిన తర్వాత పెద్దదిక్కంటూ మా వాళ్ళంతా (భార్య తాలూకు!) వచ్చి మా వూర్లోనే మకాం పెట్టారు. గోష్పాదమంత భూమీ, పాత్రసామాన్లూ పాతకొంపా 'యింకా' మిగిలాయి...మా మామగారి తాలూకు వాళ్ళెవరో ఉన్నారట; రెకమండేషన్ కోసం...అయినా ఫ్యూరిటీ..."

అవతారం ఆ అయిదేళ్ళలో సాధించినదంతా వినలేక పోతున్నాను. ఉన్న ఓపికను కూడదీసుకుని-

"అన్నట్లు, అంతా క్షేమంగా ఉన్నారా?"

"క్షేమమా—"

ఒక్క నిట్టూర్పు...సిముషంపాటు నిశ్శబ్దం... ఆ తర్వాత...

"నువ్వసలడగటానికి సందేహిస్తున్నావ్. భయపడతా వెందుకు! సూటిగా అడుగు పిల్లలెంతమందని! క్రమంగా ముగ్గురాడపిల్లలు...ఆతర్వాత వారిద్దరూ."

"అదృష్టవంతుడివిలే పో" అప్రయత్నంగా, వాడెక్కడ బాధపడతాతో అనైనా చూడకుండా, పైకి గట్టిగా అనేశాను.

"ఛీ...చిన్నప్పుడే పెళ్ళి చేసుకోకూడదురా. ఏదో అమ్మ బాధపడుతుందని అలా అఘోరిస్తే పట్టుమని పాతికేళ్ళులేవు నా బతుక్కి—అయిదుగురు సంతానం...ఛ్ఛ!"

అయిదేళ్ళ అనంతరం మా అవతారం అవస్థ చూసి, చూస్తూ చూస్తూ నవ్వుకోలేకపోయాను.

అవతారం అదృష్టం పట్టుమని ఐదేళ్ళ పాటైనా నిలవలేదు! ★